
సాక్షి బాపట్ల

గురువారం । 30 । నవంబర్ । 2023



ఈవీఎం గోడౌన్ల పరిశీలన

గుంటూరు వెస్ట్ : ఈవీఎం గోడౌన్ల భద్రతపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆర్డీఓ కార్యాలయ ఆవరణలోని ఈవీఎం గోడౌన్లను ఆయన పరిశీలించారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 816 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 420 క్యూసెక్కులు వదిలారు.



జిల్లా జైలు తనిఖీ

పట్నంబజారు : గుంటూరు జిల్లా జైలును బుధవారం న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి తనిఖీ చేశారు. ఖైదీలకు అందే ఆహారాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

న్యూస్‌రీల్

3, 4, 5 తేదీల్లో అగ్రిటెక్ సదస్సు

నరసరావుపేట: గుంటూరు లాం ఫాంలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో డిసెంబరు 3, 4, 5 తేదీల్లో నిర్వహించే అగ్రిటెక్–23 వ్యవసాయ సదస్సును పల్నాడు జిల్లా రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏరువాక కేంద్ర కో–ఆర్డినేటర్ (డాట్‌సెంటర్) డాక్టర్ సీహెచ్ వరప్రసాదరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్థాయి వ్యవసాయ ప్రదర్శనలో రైతులకు అవసరమైన వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక పరికరాలు, మెరుగైన సాగు పద్ధతులు , నూతన వంగడాలు, చీడపీడలపై యాజమాన్య పద్ధతుల ప్రదర్శన, నిపుణుల ప్రసంగాలు ఉంటాయన్నారు. రైతులు సందర్శించి పంటలపై ఉపయోగించే సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలని ఆయన కోరారు.

పంచారామాలకు ప్రత్యేక బస్సులు

పాత గుంటూరు: కార్తిక మాసం సందర్భంగా ప్రముఖ పంచారామ శైవ క్షేత్రాలను దర్శించేందుకు డిసెంబరు 2, 3 తేదీలలో గుంటూరు 2 డిపో నుంచి ప్రతిరోజు మూడు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ షేక్. అబ్దుల్ సలాం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మూడు బస్సులు 2, 3 తేదీలలో రాత్రి 9 గంటలకు గుంటూరు బస్టాండ్ నుంచి బయలుదేరి సామర్లకోట, ద్రాక్షారామం, పాలకొల్లు, భీమవరం, అమరావతిలోని శైవ క్షేత్రాలను దర్శించుకొని మరుసటి రోజు రాత్రి గుంటూరు చేరతాయని తెలిపారు. ఈ బస్సులకు రెండు రోజులపాటు 96091, 97725, 96096 బస్సు సర్వీస్ నంబర్ల ద్వారా ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. టికెట్ ధర సూపర్ లగ్జరీకి రూ.1180, అల్ట్రా డీలక్స్ బస్సుకు రూ.1,130 అని తెలిపారు. 35 మంది ప్రయాణికులు ఒకేచోట నుంచి పంచారామాలకు బయలు దేరే వారి కోసం ప్రత్యేకమైన బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని సలాం తెలిపారు. సమాచారం కోసం 7382894486 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

సాగర్ నీటిమట్టం




విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 524.20 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 20,754, ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 838.70 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయానికి రోజా నుంచి 2,687 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

యార్డులో 39,888 బస్తాల మిర్చి విక్రయం




కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 38,607 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 39,888 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి 24,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,000 నుంచి రూ.22,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.11,000 నుంచి 24,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 11,078 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ.1,500, గరిష్ట ధర రూ.2,500, మోడల్ ధర రూ.2,000 వరకు పలికింది.

అందాల కొండవేడుక



మనసు దోచే అందాలు.. 'వంపు' సొంపులొలికే ఎత్తైన కొండలు.. హిమసోయగాలతో అలరారే లోతైన లోయలు.. పచ్చని తివాచీలా స్వాగతం పలికే సుందర వనాలు.. చెవులను సుతారంగా తాకే గాలులకు తోడు లయబద్ధంగా వీనులవిందు చేసే పక్షుల కిలకిలారావాలు.. చెంతకు రారామ్మంటూ గిలిగింతలు పెట్టే సరోవరాలు.. చెంగుచెంగున పరుగులు తీస్తూ నర్తించే జంతువులు.. అబ్బురపరిచే ఔషధ వృక్ష సంపద.. కట్టిపడేసే చారిత్రక కట్టడాల సౌందర్యం.. ఒక్కసారి వెళితే 'కొండవీడు'తరమా అనిపించె ఆనందానుభూతులు కొండవీడు సొంతం.

- భూతల స్వర్గం కొండవీడు
- పర్వతారోహణకు అనువు
- కొండకోనల్లో రాత్రి కొలువు
- ఆకట్టుకునే వసతులకు లేదు కొదవు
- కార్తిక వన సమారాధనలకూ వేదిక

గుంటూరు డెస్క్ : రాష్ట్ర ప్రభుత్వ కృషితో కొండవీడుకోట పర్యాటకంగా అభివృద్ధి చెందుతోంది. సకల సౌకర్యాలతో సందర్శకులకు తీపి జ్ఞాపకాలు మిగులుస్తోంది. ఈ ప్రాంతాన్ని కొండవీడు రెడ్డిరాజులు ఏలినట్టు చరిత్ర చెబుతోంది. పెదకోమటి వేమారెడ్డి, కుమారగిరిరెడ్డి ఇక్కడి కట్టడాలను నిర్మించారని తెలుస్తోంది. ఈ కోట అందాలను కవి సార్వభౌముడు శ్రీనాథుడూ కీర్తించాడని ఫిరంగిపురం శాసనం తెలియజేస్తోంది. ఇంతటి ప్రాశస్త్యమున్న ఈ ప్రాంతం అభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. చిలకలూరిపేట ఎమ్మెల్యే, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ఈ గిరిదుర్గం అభివృద్ధికి చర్యలు చేపట్టారు. వివిధ శాఖల మంత్రుల సహకారం తీసుకుంటూ ఎప్పటికప్పుడు కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అనుమతులు తీసుకొస్తున్నారు. కొండవీడు – నగరవనం పేరిట నిధులు విడుదల చేయిస్తున్నారు.



కొండవీడులో అభివృద్ధి పనుల శిలాఫలకం ఆవిష్కరించిన నేటి మంత్రి రజని, నాటి మంత్రి బాలినేని (ఫైల్)

మహానేత అంకురార్పణ చేశారు.. జననేత కొనసాగిస్తున్నారు

కొండవీడు అభివృద్ధికి శ్రీకారం చుట్టినది మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి. 2005లో ఘాట్ రోడ్డుకు రూ.5 కోట్లు ఆర్‌అండ్‌బీ శాఖకు కేటాయించారు. దీనికోసం జిల్లాకు చెందిన నాటి మంత్రులు గాదె వెంకటరెడ్డి, కాసు వెంకట కృష్ణారెడ్డి కూడా కృషి చేశారు. ప్రస్తుతం కొండవీడు సమగ్ర అభివృద్ధికి జననేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారు. కొండవీడుకోటలో సందర్శకులకు కావాల్సిన సౌకర్యాలు కల్పించేందుకు నిధులను దశల వారీగా విడుదల చేస్తున్నారు. పర్యాటకంగా అభివృద్ధి చేస్తున్నారు.



కొండవీడుపై చారిత్రక కట్టడాలు

మెరుగైన వసతులు

ప్రభుత్వ నిధులతో కొండపై రెండోదశ ఘాట్‌రోడ్డు నిర్మించారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో స్వాగత ద్వారం ఏర్పాటు చేశారు. చిల్డ్రన్స్ పార్కు తీర్చిదిద్దారు. తాగునీటి సౌకర్యం కల్పించారు. మరుగుదొడ్లు నిర్మించారు. రక్షణ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. భోజనశాల, విశ్రాంతి షెల్టర్లు నిర్మించారు. వెదుళ్ల చెరువు వద్ద డెక్ ఏర్పాటు చేశారు. పుట్టాలమ్మ, ముత్యాలమ్మ చెరువుల చుట్టూ వాకింగ్ ట్రాక్, కట్టపై బెంచీలు ఏర్పాటు చేశారు. యోగి వేమన, అనపోతారెడ్డి విగ్రహాలను తీర్చిదిద్దారు. చారిత్రక అంశాలు, సందర్శకుల ప్రాంతాల వివరాల బోర్డుల గ్యాలరీ ఏర్పాటు చేశారు. ఆహ్లాదం పంచే పూలు, నీడనిచ్చే చెట్లతోపాటు ఔషధ, అరుదైన మొక్కలు పెంచుతున్నారు. కొండవీడు అందాలు వీక్షించేందుకు వీలుగా వ్యూపాయింట్స్ ఏర్పాటు చేశారు. చేతివెన్నముద్ద కృష్ణుడి విగ్రహం, కొండవీడు రాజుల చరిత్రను కళ్లకు కట్టేలా ఏర్పాటు చేసిన మ్యూజియం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

కొండవీడు- నగరవనం ద్వారా నిధుల విడుదల ఇలా..

సంవత్సరం	నిధులు (రూపాయల్లో)
2019	1,17,00,000
2020	36,63,000
2021	1,43,00,000
2022	92,75,000
రెండో దశ ఘాట్ రోడ్డు కోసం	11,50,00,000



కొండపై కార్తిక సందడి

కొండవీడు సందర్శనకు వచ్చే వారికి సకల సదుపాయాలు కల్పించడంతో రోజురోజుకు పర్యాటకుల సంఖ్య పెరుగుతోంది. ప్రస్తుతం కార్తికమాసం కావడంతో వనసమారాధనలకూ ఈ ప్రాంతం వేదికవుతుండడం గమనార్హం. ఫలితంగా ఒకప్పుడు వారాంతపు సెలవులు, పండుగ దినాల్లో మాత్రమే కనిపించే రద్దీ ఇప్పుడు నిత్యకృత్యమైంది. కార్తిక మాసం సందర్భంగా బంధుమిత్ర, సకుటుంబ సమేతంగా ప్రజలు ఇక్కడికి తరలివచ్చి ఆనందంగా గడిపి సంతోషాలను, ఆనందానుభూతులను మూటగట్టుకుని తీసుకెళ్తున్నారు.



సందర్శకులకు రక్షణ.. అటవీ సంపదకు సంరక్షణ

ఇక్కడ రాత్రి బస(నైట్ క్యాంప్)కూ అధికారులు ఏర్పాట్లు చేశారు. పది గుడారాలు, చీకటి భయం లేకుండా విద్యుత్ సౌకర్యం, ఫారెస్టు ఏరియాలోకి వెళ్లకుండా అడ్డుగా ఫెన్సింగ్, ప్రత్యేక నిఘా కెమెరాలు, చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. పర్యావరణ, పర్యాటకుల సంరక్షణకు ప్రత్యేక స్ట్రైకర్స్‌ను నియమించారు.

సాహస క్రీడలకూ ఆలవాలం

కొండను పర్వతారోహణకూ అనువుగా తీర్చిదిద్దారు. సాహస క్రీడల కోసం రాక్‌క్లైంబింగ్, రాపెల్లింగ్, జిప్‌లైన్, జిప్‌సైక్లింగ్, ట్రామ్పోలిన్, విలువిద్య కేంద్రాలు ఏర్పాటు చేశారు. జల విహారం కోసం చెరువుల్లో 3 పాడవైన పడవలు, 2 ఫెడల్ బోట్లు ఏర్పాటు చేశారు.

ఉచితంగా అత్యాధునిక ఆపరేషన్లు

పైసా ఖర్చు లేకుండా రూ.లక్షన్నర ఖరీదు చేసే ఆపరేషన్



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు పట్నాల కవిత. గుంటూరు వాసవి నగర్‌కు చెందిన ఈమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ప్రైవేటు ఆసుపత్రుల్లో చూపించుకున్నా.. వ్యాధి నిర్ధారణ కాలేదు. చివరకు గుంటూరు జీజీహెచ్‌కు అక్టోబరు 31న చికిత్స కోసం వచ్చింది. జనరల్ సర్జరీ రెండో యూనిట్ వైద్యులు పరీక్షలు చేసి గాల్‌బ్లాడర్ స్టోన్ ఉన్నట్లు నిర్ధారించారు. నవంబరు 2న అత్యాధునిక ల్యాప్రోస్కోపిక్ విధానంలో ఎలాంటి కోత, కుట్లు లేకుండా ఆపరేషన్ చేసి గాల్ బ్లాడర్ స్టోన్ తొలగించారు. సుమారు రూ.లక్షన్నర ఖరీదు చేసే ఆపరేషన్‌ను డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా చేశారు.



ఆస్పత్రిలో ఉన్న లాప్రోస్కోపిక్ పరికరం

- కోత, కుట్లు లేకుండానే శస్త్రచికిత్సలు
- గుంటూరు జీజీహెచ్‌లో అందుబాటులో..
- కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా లాప్రోస్కోపిక్ సర్జరీలు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లోని పలు వార్డుల్లో ల్యాప్రోస్కోపిక్ సర్జరీలు రోజూ జరుగుతున్నాయి. పిల్లల శస్త్ర చికిత్స విభాగం, జనరల్ సర్జరీ విభాగాల్లో ఒక్కోదాంట్లో రెండేసి చొప్పున ల్యాప్రోస్కోపిక్ వైద్య పరికరాలు ఉన్నాయి. ఈఎన్‌టీ, గైనిక్, న్యూరోసర్జరీ, గ్యాస్ట్రోఎంట్రాలజీ, యూరాలజీ వైద్య విభాగాల్లో ఒక్కొక్కటి చొప్పున ల్యాప్రోస్కోపిక్ పరికరాలు ఉన్నాయి. ఈ వైద్య విభాగాల్లో రోజూ అత్యాధునిక ల్యాప్కోస్కోపిక్ సర్జరీలు కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా జరుగుతున్నాయి. ఎంపెడిక్స్, గాల్‌బ్లాడర్ స్టోన్స్, హెర్నియా, హిస్టెక్టమీ, వేరికోస్, పేగు మడత, నెఫ్రెక్టమీ, ట్రాన్స్‌ప్లాంటేషన్, ఓవరీసిస్ట్, ట్యూబ్‌లో గర్భం రావటం వంటి సమస్యలకు, పలు రకాల క్యాన్సర్లు, పలు వ్యాధుల నిర్ధారణకు సుమారు రూ.లక్ష నుంచి ఆరు లక్షల ఖరీదు చేసే ల్యాప్కోస్కోపిక్ సర్జరీలు ఉచితంగా జరుగుతున్నాయి.

బహుళ ప్రయోజనాలు..

సాధారణ ఆపరేషన్‌లతో పోలిస్తే ల్యాప్రోస్కోపిక్ సర్జరీలతో రోగులకు బహుళ ప్రయోజనాలు ఉంటాయి. శస్త్రచికిత్సకు చాలా తక్కువ సమయం పడుతుంది. రోగికి ఎలాంటి రక్తం ఎక్కించాల్సిన పని ఉండదు. ఎలాంటి కోత, కుట్లు ఉండవు. ఆపరేషన్ చేసిన రోజే డే కేర్ సర్జరీ మాదిరిగా ఇంటికి వెళ్లే అవకాశం కలుగుతుంది. సుమారు 5 నుంచి 10 మిల్లీ మీటర్ల పరిమాణంలో రెండు లేదా నాలుగు రంధ్రాలు వేస్తారు. తద్వారా గాయం చాలా త్వరగా మానుతుంది. ఆపరేషన్ చేయించుకున్న చోట చీము పట్టడం వంటి సమస్యలు రావు. రోగి చాలా త్వరగా కోలుకుంటారు.

రోజూ ల్యాప్రోస్కోపిక్ సర్జరీలు..



గుంటూరు జీజీహెచ్‌లో కార్పొరేట్ ఆస్పత్రుల కంటే దీటుగా ల్యాప్రోస్కోపిక్ సర్జరీలు చేస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ఆస్పత్రుల బలోపేతమే లక్ష్యంగా విప్లవాత్మక మార్పులు వైద్య రంగంలో తీసుకొచ్చారు. అత్యాధునిక వైద్య పరికరాలను సీఎం జీజీహెచ్‌కు మంజూరు చేశారు. కార్పొరేట్ ఆస్పత్రులకు ఏ మాత్రం తీసిపోని విధంగా జీజీహెచ్ వైద్యులు అన్ని రకాల ఆపరేషన్లు అత్యాధునిక వైద్య పరికరాలతో ఉచితంగా చేస్తున్నారు.

– డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు



చినగంజాంలో అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

చినగంజాం: భూ సమస్యల పరిష్కారానికి అధికారులు సత్వరం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. బుధవారం వేంకటేశ్వర కల్యాణ మండపంలో జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికే జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. చినగంజాంలో రెవెన్యూ భూములకు సంబంధించిన సమస్యలు ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. అలాగే ఇళ్లస్థల పట్టాల కోసం అధికంగా అర్జీలు వస్తున్నాయని వివరించారు. స్పందన అర్జీల పరిష్కారంపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. గృహ నిర్మాణాల ప్రగతిపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్, జిల్లా రెవెన్యూ అధికారి పి. వెంకటరమణ, చీరాల ఆర్డీఓ పి.సరోజిని, చీరాల డీఎస్పీ ప్రసాదరావు, డీఆర్‌డీఏ పీడీ అర్జునరావు, గృహనిర్మాణ శాఖ పీడీ ప్రసాద్, జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు, పంచాయతీ రాజ్ ఎస్ఈ హరినారాయణ, పౌరసరఫరాల శాఖ డీఎస్ఓ విలియమ్స్, డీఎం శ్రీలక్ష్మి, ఎంపీడీఓ కె.స్వరూపరాణి, తహసీల్దార్ పి.పార్వతి పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా

కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల: అత్యంత పారదర్శకంగా ప్రత్యేక సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా రూపొందిస్తున్నామని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. ప్రత్యేక సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితాపై గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు.

ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించిన తదుపరి చేర్పులు, మార్పుల కోసం అభ్యంతరాలపై దరఖాస్తులు స్వీకరిస్తున్నామని కలెక్టర్ చెప్పారు. డిసెంబర్ 9 వరకు అభ్యంతరాలకు అవకాశం ఉందన్నారు. 18 ఏళ్లు నిండి ఓటు హక్కు పొందడానికి అర్హులైన వారు సుమారుగా 60 వేల మంది ఉన్నట్లు అంచనా వేశామని పేర్కొన్నారు. ప్రస్తుతం 12 వేల మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. మిగిలిన వారంతా దరఖాస్తు చేసుకునేలా రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. ఇప్పటికే అన్ని కళాశాలల్లో ఓటు హక్కు ప్రాధాన్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు 1,44,782 వివిధ దరఖాస్తులలో 1,13,035 విచారణ పూర్తయిందని, 18,988 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయన్నారు. మిగిలిన 12,759 దరఖాస్తులు విచారణ పూర్తి చేసి ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయాల్సి ఉందన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో 12,023 మంది ఓటర్ల ఫొటోలు రెండు పర్యాయాలు ప్రచురితమైనట్లు గుర్తించామన్నారు. వాటిని తొలగించే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. రాజకీయ పార్టీల సమక్షంలోనే ప్రతి కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో డీఆర్వో పి. వెంకటరమణ, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు కృష్ణకాంత్, వైఎస్సార్ సీపీ నుంచి ఇనగలూరి మాల్యాద్రి, బీజేపీ నాయకులు రామకృష్ణ, సీపీఎం నాయకులు కోటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు డి.రవి, బీఎస్పీ నాయకులు కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు గౌస్ బాషా, తదితరులు పాల్గొన్నారు.



2కే రన్ ప్రారంభిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

ఓటు ప్రాధాన్యాన్ని అందరూ గుర్తించాలి

ఓటు హక్కు ప్రాధాన్యాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. ఓటు హక్కుపై నిర్వహించిన 2కే రన్ అవగాహన కార్యక్రమాన్ని కలెక్టర్ పచ్చజెండా ఊపి బుధవారం ప్రారంభించారు. బాపట్ల పట్టణంలో వందల సంఖ్యలో విద్యార్థులు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. బాపట్ల మున్సిపల్ ఉన్నత పాఠశాల నుంచి ప్రారంభమైన 2కే రన్ పాత బస్టాండ్ సెంటర్, గడియార స్తంభం సెంటర్, అంబేడ్కర్ విగ్రహం మీదుగా రథం బజార్, రైల్వే స్టేషన్ రోడ్డులో నుంచి తిరిగి మున్సిపల్ ఉన్నత పాఠశాల వరకు కొనసాగింది. విద్యార్థులు ప్లకార్డులు చేతబూని 18 ఏళ్ల వయస్సు నిండిన వారంతా ఓటు హక్కు పొందాలని, ఓటు హక్కు విలువను గుర్తించాలంటూ పెద్ద ఎత్తున నినదించారు. ప్రత్యేక సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా రూపకల్పనకు డిసెంబర్ 9 వరకు అభ్యంతరాలు, చేర్పులపై దరఖాస్తులు స్వీకరిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ, బాపట్ల ఆర్డీఓ జి.రవీందర్, ఓటర్ల అవగాహన కార్యక్రమాల ప్రత్యేక అధికారి రామారావు, మున్సిపల్ కమిషనర్ భాను ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష దీపోత్సవం

అమరావతి: అమరేశ్వరాలయంలో కార్తిక మాసాన్ని పురస్కరించుకుని నరసరావుపేటకు చెందిన అమ్మ అసోసియేషన్, బాలచాముండికా సమేత అమరేశ్వర ఆధ్యాత్మిక సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో లక్ష దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అలయంలో స్వామి ఎదురుగా వేదపండితుల ప్రత్యేక పూజల అనంతరం అమ్మ సంస్థ ప్రతినిధులు శివాజీ, యోగేశ్వరరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి వేమూరి గోపినాథ శర్మ చేతులమీదుగా భగవన్నామ సంకీర్తనలు, మేళాతాళాల నడుమ లక్ష దీపోత్సవాన్ని ప్రారంభించారు. మహిళలు లక్ష దీపాలను వెలిగించారు. ఈ దీపకాంతులతో ఆలయం కొత్తశోభను సంతరించుకొంది.



అమరేశ్వరాలయంలో లక్ష దీపోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

లక్ష బిల్వార్చన

అమరేశ్వరాలయంలో శనివారం లోక కల్యాణార్థం ప్రజలంతా సుభిక్షంగా సుఖసంతోషాలతో జీవించాలనే సంకల్పంతో దాతల సహకారంతో అమరేశ్వరునికి లక్ష బిల్వార్చనను భక్తిశ్రద్ధలతో అలయ అర్చకులు, వేదపండితులు జరిపించారు. తొలుత మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. గణపతి హోమం చేశారు. స్వామికి విశేష అలంకరణ అనంతరం సహస్ర నామాలతో రుత్విక్కులు అమరేశ్వరునికి లక్ష బిల్వ దళార్చన నిర్వహించారు. బాలచాముండికా అమ్మవారికి లక్ష కుంకుమార్చనలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖరశర్మ మాట్లాడుతూ లక్ష బిల్వార్చన, కుంకుమార్చనల విశిష్టతను వివరించారు.

3న జాతీయ ఉపకార వేతన పరీక్ష



నరసరావుపేట ఈస్ట్: జాతీయ స్థాయిలో నిర్వహించే జాతీయ ప్రతిభాన్వేషణ ఉపకార పరీక్ష (ఎన్ఎంఎంఎస్) 2023–24 విద్యాసంవత్సరానికి గాను డిసెంబర్ 3వ తేదీన జరుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ బుధవారం తెలిపారు. డివిజన్ కేంద్రాలలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. విద్యార్థులు తమ హాల్ టిక్కెట్లను www.bre.ap.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్ష నిర్వహణకు సంబంధించి ఆయా పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లకు డిసెంబర్ 1వతేదీ శుక్రవారం ఉదయం 11గంటలకు డీఈఓ కార్యాలయంలో శిక్షణా తరగతులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రతిభ గల విద్యార్థులకు ఆర్థిక చేయూతను అందించేందుకు జాతీయస్థాయిలో ఈపరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. ఉత్తీర్ణులైన విద్యార్థులకు 4 సంవత్సరాల పాటు ఏడాదికి రూ.12వేలు అందిస్తారని వివరించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి 4,078మంది విద్యార్థులకు ఉపకార వేతనం లభిస్తుందని తెలిపారు.

క్లుప్తంగా

తెనాలి సబ్‌జైలు నిర్మాణానికి శంకుస్థాపన


సబ్‌జైల్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న హరీష్‌కుమార్ గుప్తా

తెనాలిరూరల్: సబ్ జైలు పునర్నిర్మాణానికి అధికారులు శంకుస్థాపన చేశారు. రాష్ట్రంలోనే మోడల్ జైలుగా నిర్మించాలని గతేడాది రూ.2.50 కోట్లతో అంచనాలు సిద్ధం చేశారు. ఈ ఏడాది సెప్టెంబరులో సబ్‌జైలును మూసివేసి పనులు ప్రాంభించేందుకు రంగం సిద్ధం చేశారు. కొన్ని సాంకేతిక కారణాలు, అంచనా వ్యయం పెరగడంతో జైలును తిరిగి ప్రారంభించారు. తాజాగా రూ.3.30 కోట్లతో అంచనాలను రివైజ్ చేశారు. ఇక నిర్మాణ పనులు ప్రారంభించేందుకు అన్ని అనుమతులూ లభించాయి. ఈ నేపథ్యంలో సీనియర్ ఐపీఎస్ అధికారి, హోంశాఖ ముఖ్య కార్యదర్శి, ఇన్‌చార్జి డీజీ(జైళ్ల శాఖ) హరీష్‌కుమార్ గుప్తా తెనాలి సబ్‌జైలు నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛరణలతో శాస్త్రోక్తంగా శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. రాష్ట్రంలోనే మోడల్ జైలుగా తెనాలి సబ్‌జైలును నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. వీరి వెంట జైళ్ల శాఖ గుంటూరు డీఐజీ ఎం.వరప్రసాద్, జిల్లా అధికారి ఆర్‌వీ ప్రసాద్, ఇతర అధికారులు, సబ్ జైలు సిబ్బంది ఉన్నారు. తెనాలి సబ్‌జైలును బ్రిటిష్ పాలకులు 1912లో నిర్మించారు. ప్రస్తుతం ఇది శిథిలావస్థకు చేరుకోవడంతో అధునాతన సౌకర్యాలతో పునర్నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దేశంలోనే మోడల్ జైలుగా తెనాలి సబ్‌జైలు నిర్మాణం జరగనుంది. ఇప్పటికే అన్ని అనుమతులు లభించడంతో జైలును మరో వారం రోజుల్లో మూసి వేయాలని అధికారులు నిర్ణయించారు. మరి కొద్ది రోజుల్లో నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి.

హోరాహోరీగా సాగిన క్రీడాపోటీలు


బ్యాడ్మింటన్‌లో తలపడుతున్న ఇరుజట్లు

బాపట్ల: బాపట్ల వ్యవసాయ కళాశాలలో నిర్వహిస్తున్న ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ అనుబంధ అంతర కళాశాలల క్రీడల ప్రథమ దశ పోటీలు బుధవారానికి రెండో రోజుకు చేరాయి. వివరాలను బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు వెల్లడించారు. చెస్ పోటీలో తిరుపతి కళాశాల విజేతగా నిలువగా బాపట్ల వ్యవసాయ కళాశాల రన్నర్‌గా నిలిచింది. వ్యవసాయ కళాశాల నైరా, ఎస్.వి. వ్యవసాయ కళాశాల- తిరుపతి మధ్య బాల్ బ్యాడ్మింటన్ ఫైనల్ పోటీలో నైరా కళాశాల విజేతగా కాగా తిరుపతి కళాశాల రన్నర్‌గా నిలిచింది. వాలీబాల్ పోటీలలో బాపట్ల వ్యవసాయ కళాశాల- నైరా వ్యవసాయ కళాశాల ఫైనల్స్‌కు చేరుకోగా, కారమ్స్ పోటీలో ఎస్.వి.వ్యవసాయ కళాశాల తిరుపతి- కింజరాపు ఎర్రన్నాయుడు కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్స్, ఎచ్చెర్ల ఫైనల్స్‌కు చేరుకున్నాయి. బాస్కెట్ బాల్‌లో తిరుపతి ఎస్.వి. వ్యవసాయ కళాశాల, నైరా వ్యవసాయ కళాశాల ఫైనల్స్‌కు చేరుకోగా, టేబుల్ టెన్నిస్ పోటీలో బాపట్ల వ్యవసాయ కళాశాల ఫైనల్స్‌కు చేరుకున్నట్లు శ్రీనివాసరావు వివరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.రవి కాంత్ రెడ్డి, ఆఫీసర్ ఇన్‌చార్జి ఆఫ్ స్టూడెంట్ యాక్టివిటీస్ డాక్టర్ టి.వి.శ్రీధర్ పాల్గొన్నారు.

ఇంకొల్లు పంచాయతీ ఉద్యోగి అరెస్ట్

ఇంకొల్లు (చినగంజాం): ఇంకొల్లు పంచాయతీ కార్యాలయంలో రికార్డుల తగులబెట్టిన కేసులో నిందితుడిని పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఇంకొల్లు ఎస్ఐ ఎస్‌కే నాయబ్ రసూల్ అందించిన వివరాలు.. అంగలకుదురు చైతన్య ఇంకొల్లు పంచాయతీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. అయితే పంచాయతీ అవకతవకలు చోటుచేసుకోవడంతో ఇక్కడ పనిచేసిన పంచాయతీ కార్యదర్శి మోహన్‌బాబును అధికారులు సస్పెండ్ చేశారు. రికార్డులు సరిగా లేకపోవడంతో అధికారులు తనపై కూడా శాఖాపరమైన చర్యలు తీసుకుంటారని ఆందోళన చెందాడు. అనంతరం చైతన్యకు కూడా షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో అతడు ఇక్కడ నుంచి చీరాల డివిజనల్ కార్యాలయానికి డెప్యూటేషన్‌పై వెళ్లేందుకు ఆర్డర్ కాపీ తీసుకొని ఇంకొల్లు ఎంపీడీఓ వద్దకు వెళ్లాడు. అయితే ఆమె కొత్త కార్యదర్శికి పూర్తి బాధ్యతలు, రికార్డులు అప్పగిస్తే రిలీవ్ చేస్తామని చెప్పారు. రికార్డులు తగులబెట్టి సాక్ష్యం లేకుండా చేస్తే తనపై ఎంక్వయిరీ ఉండదని పెట్రోలు పోసి నిప్పు అంటించి మంగళవారం రికార్డులు తగులబెట్టాడు. దీనిపై ఉన్నతాధికారుల ఫిర్యాదు మేరకు చైతన్యను ఇంకొల్లులోని హనుమోజీపాలెం రోడ్డులో తన సిబ్బందితో కలిసి బుధవారం అదుపులోనికి తీసుకున్నట్లు చెప్పారు. కార్యదర్శి గదిలో ఉన్న ప్రభుత్వ పత్రాలను పెట్రోల్ పోసి నిప్పు అంటించినట్లు నేరాన్ని అంగీకరించినట్లు ఎస్ఐ వివరించారు.

18 ఏళ్లు నిండిన వారందరూ ఓటు హక్కు పొందాలి


ర్యాలీలో డీఆర్ఓ వినాయకం, ఆర్డీఓ శేషిరెడ్డి, తహసీల్దార్ రమణానాయక్ తదితరులు

నరసరావుపేట: జిల్లాలో పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం కోరారు. దీనికి మరో పదిరోజుల సమయం మాత్రమే ఉందన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బుధవారం 18ఏళ్లు నిండిన నూతన ఓటర్లకు అవగాహన నిమిత్తం సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్-2023(స్వీప్)పై పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సచివాలయ ఉద్యోగులు, విద్యార్థులతో మున్సిపల్ కార్యాలయం నుంచి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ స్టేషన్‌రోడ్డుగుండా పల్నాడురోడ్డు ప్రభుత్వ వైద్యశాల మీదుగా రెడ్డికళాశాల సెంటర్‌వరకు కొనసాగింది. అక్కడ డీఆర్ఓ మాట్లాడుతూ జిల్లాలో 18 నుంచి 19ఏళ్లలోపు వయస్సు ఉన్న వారు నూతన ఓటరుగా చేరటం జిల్లాలో తక్కువ శాతంగా ఉందన్నారు. ఈ వయస్సు ఉన్నవారు 4.9శాతం మంది ఉండగా కేవలం 1.4శాతం మంది మాత్రమే ఓటర్లుగా చేరారన్నారు. చాలా మంది డిగ్రీ కళాశాల విద్యార్థులు ఓటర్లుగా చేరలేదన్నారు. ఓటరుగా చేరేందుకు మరో 10రోజుల సమయం ఉన్నందున డిసెంబరు 9వ తేదీలోగా ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 2024 జనవరి ఒకటో తేదీ నాటికి 18ఏళ్లు నిండిన వారు కూడా ఓటరుగా నమోదు కావొచ్చన్నారు. చదివే కళాశాలలు, లేదా నివాసం ఉండే పట్టణాలు, గ్రామాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఓటరుగా చేరిన వారికి ఉచితంగా ఓటరు ఐడీ కార్డు వస్తుందని, భవిష్యత్‌లో జనన ధ్రువీకరణపత్రం తీసుకునేందుకు కూడా ఈ ఓటరు కార్డు ఉపయోగపడుతుందన్నారు. ర్యాలీలో నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్డీఓ ఎం.శేషిరెడ్డి, తహసీల్దార్ రమణానాయక్, మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో సెక్టార్ ఆఫీసర్ల పాత్ర కీలకం

శిక్షణ కార్యక్రమంలో గుంటూరు కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి



మాట్లాడుతున్న గుంటూరు కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి వేదికపై కమిషనర్ కీర్తి, సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ

గుంటూరు వెస్ట్: ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సెక్టార్ ఆఫీసర్ల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన సెక్టార్ ఆఫీసర్లు, సెక్టార్ పోలీసు ఆఫీసర్ల శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విధులకు సంబంధించి భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను క్షుణ్ణంగా చదివి విధులు నిర్వహించాలన్నారు. ఒక్కో సెక్టార్ ఆఫీసర్ పరిధిలో 12 పోలింగ్ కేంద్రాలు ఉంటాయన్నారు. ఈ పరిధిలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఓటింగ్ చేసేందుకు, మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రతి అధికారి తప్పకుండా తన పరిధిలోని పోలింగ్ కేంద్రాన్ని భౌతికంగా పరిశీలించి ఏర్పాట్లు చేయాలన్నారు. సెక్టార్ పరిధిలోని బీఎల్‌ఓలతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ అవసరమైన ఏర్పాట్లను చేయాలని పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వలంటీర్ల సేవలు వినియోగించవద్దని తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసినప్పటి నుంచి అధికారులు ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండి ప్రజలకు స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించాల్సి ఉంటుందన్నారు. దీనికి సంబంధించి ఇబ్బందులు, సందేహాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఆర్‌ఓ చంద్రశేఖరరావు, అడిషనల్ ఎస్పీ సుప్రజ, ఆర్డీఓ పి.శ్రీకర్ పాల్గొన్నారు.

అభ్యంతరాలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి...

గుంటూరు వెస్ట్: జిల్లాలోని ఎస్ఎస్ఆర్-2024 డ్రాఫ్ట్ జాబితాకు సంబంధించి వచ్చిన అభ్యంతరాలను, క్లెయిమ్స్‌ను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజాప్రతినిధుల, అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాలో ఫొటో సిమిలర్ ఎంట్రీలు, డెమోగ్రాఫికల్ సిమిలర్ ఎంట్రీలు, డూప్లికేట్ ఓటర్ల వివరాలు క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఓటర్ల లిస్టుల్లో జీరో డోర్ నెంబర్ లేకుండా పూర్తిస్థాయి సవరణకు చేయాలని చెప్పారు. ఓటర్ల వెరిఫికేషన్‌కు బీఎల్‌ఓలు ఖచ్చితంగా వెళ్లాలన్నారు. జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలి

గుంటూరు వెస్ట్: రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధికి కృషి చేస్తోందని, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి క్యాంపు కార్యాలయం నుంచి పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెస్సింగ్ యూనిట్లకు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, డిప్యూటీ మేయర్ షేక్ సజీల, డీఆర్‌ఓ చంద్రశేఖరరావు, పరిశ్రమల శాఖ ఏడీ రామకృష్ణ, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ వి.గోపీకృష్ణలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆటోనగర్‌లోని ఎంఎస్ఈ - సీడీపీ ప్రాజెక్ట్ ద్వారా రూ.3.08 కోట్లతో నిర్మించిన 1,3 కి.మీ సీసీ రోడ్లు, క్రాస్ డ్రైన్లు, రూ.2.36 కోట్లతో ఏర్పాటు చేసిన 220 వీధి దీపాలను ముఖ్యమంత్రి వర్చువల్ విధానంలో ప్రారంభించారని తెలిపారు. మౌలిక సదుపాయాల ఏర్పాటు వల్ల స్థానికులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని చెప్పారు. పరిశ్రమల స్థాపనకు ముందుకు వస్తే ప్రభుత్వం తరపునుంచి అన్ని సదుపాయాలు, అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. కార్పొరేటర్ పఠాన్ రిహానా, ఆటోనగర్ ఇండస్ట్రీస్, మాన్యుఫ్యాక్చర్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆంధ్రాను అన్నింటా అగ్రగామిగా నిలుపుదాం

- ఆంధ్రా వేదికగా అంతర్జాతీయ క్రీడాకారులను అందించాలి
- ఏఎన్‌యూలో పర్యటించిన అంబటి రాయుడు


విద్యార్థులతో మాట్లాడుతున్న అంబటి రాయుడు

ఏఎన్‌యూ: ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు అందరం కృషి చేద్దామని అంతర్జాతీయ మాజీ క్రికెటర్ అంబటి రాయుడు యువతకు పిలుపునిచ్చారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో బుధవారం రాయుడు పర్యటించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో జరిగిన పరస్పర చర్చా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తనకు ఉన్నత స్థాయిని ఇచ్చిన ఈ సమాజానికి ఎంతో కొంత తిరిగి ఇవ్వాలనే లక్ష్యంతోనే ప్రస్తుతం సేవా కార్యక్రమాలు, పర్యటనలు నిర్వహిస్తున్నానన్నారు.

ప్రస్తుతం మహిళలను ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే పలు శిక్షణా కార్యక్రమాలు, యువతకోసం ఉపాధి సంబంధిత నైపుణ్యం, కెరీర్ గైడెన్స్, వ్యక్తిత్వ వికాస అంశాలపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని తెలిపారు. క్రికెట్‌తోపాటు అన్ని క్రీడల్లో ఆంధ్రా నుంచి అంతర్జాతీయ క్రీడాకారులను అందించేందుకు తనకున్న అనుభవం, నైపుణ్యం ఉపయోగిస్తానన్నారు. తాను పుట్టిన గుంటూరు జిల్లా వేదికగా అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లు జరగాలని ఆకాంక్షించారు.

నేను పడ్డ ఇబ్బందులు చాలా ఉన్నాయి..

విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు అంబటి రాయుడు సమాధానాలిచ్చారు. తాను చిన్నప్పుడు ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నానో ఎప్పుడూ గుర్తుంటాయన్నారు. అలాంటి పరిస్థితుల్లో ఉన్న వారికి ఏదోఒక విధంగా సహాయం చేయాలన్నదే నా లక్ష్యమన్నారు. ప్రతి మండలానికొక పరిశ్రమ, అంతర్జాతీయ ప్రమాణాలున్న క్రీడా వసతుల కల్పన కోసం కృషి చేయాలన్నదే తన ఆకాంక్ష అన్నారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్లాంటేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. యూనివర్సిటీలో ఉన్న సింథటిక్ ట్రాక్ తదితర క్రీడా వసతులను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఏఎన్‌యూలో అంతర్జాతీయ క్రీడా వసతులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వీసీ ఆచార్య పి.రాజశేఖర్, రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, ప్రిన్సిపాల్స్ ఆచార్య పి.సిద్ధయ్య, ఆచార్య జాన్సన్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ డి రవిశంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిట్టీల పేరుతో మోసం.. భార్యాభర్తలకు జైలు, జరిమానా

తెనాలిరూరల్: చిట్టీల పేరుతో మోసానికి పాల్పడిన భార్యాభర్తలకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తెనాలి చినరావూరుకు చెందిన దంపతులు సయ్యద్ ఇబ్రహీం, సయ్యద్ షర్మిల ప్రైవేటు చిట్టీలు నిర్వహిస్తూ ఉండేవారు. 2016లో వీరు సుమారు రూ. 17.80 లక్షలు చిట్టీల పేరిట సేకరించి మోసానికి పాల్పడ్డారు. వీరి బాధితులు పోలీసులను ఆశ్రయించగా అప్పటి వన్‌టౌన్ ఎస్ఐ కాటూరి వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. 30 మంది వరకు బాధితులను విచారించి నిందితులను కోర్టులో హాజరుపరిచారు. కేసు బుధవారం విచారణకు రావడంతో సాక్ష్యాధారలను పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైఎస్‌బీజీ పార్థసారధి నిందితులైన దంపతులకు నాలుగేళ్ల జైలు శిక్ష, రూ. 50 వేలు చొప్పున జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఏడాది జైలు శిక్ష అనుభవించాలన్నారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎండీ సుల్తాన్ సిరాజుద్దీన్ వాదించారు.

నందివెలుగులో రూ.3.50 కోట్లతో సబ్‌స్టేషన్

- ఏడు గ్రామాలకు నిరంతర విద్యుత్ సరఫరా
- ప్రారంభించిన ఎమ్మెల్యే శివకుమార్


సబ్‌స్టేషన్ వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిటౌన్: ప్రజలకు నిరంతరం విద్యుత్ సరఫరా అందించేందుకు రూ.3.50 కోట్లతో నందివెలుగులో విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. రూరల్ మండలం నందివెలుగు గ్రామంలో నిర్మాణం చేసిన 33కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను బుధవారం ఎమ్మెల్యే శివకుమార్ ప్రారంభించారు. సభకు గ్రామ సర్పంచి ధూళిపాళ్ల పవన్‌కుమార్ అధ్యక్షత వహించారు. సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలంటే ఇబ్బందిగా ఉన్నందున పట్టణానికి ఆనుకుని ఉన్న గ్రామాల్లో పరిశ్రమలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం ఉంటే పరిశ్రమలు వస్తాయన్నారు. సబ్‌స్టేషన్ ఏర్పాటు వల్ల విద్యుత్ కష్టాలు తీరతాయని, విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని కోరారు. గ్రామంలో సంక్షేమ పథకాల కింద లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో రూ.27కోట్లు జమచేశామన్నారు. రెండో విడత ఇళ్లస్థలాలను అర్హులకు జనవరిలో పంపిణీ చేస్తామన్నారు. కన్‌స్ట్రక్షన్ ఈఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్‌డీఎస్ పథకం కింద 5వేల జనాభా ఉన్న గ్రామాల్లో త్రీ ఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. దీనివల్ల సబ్ స్టేషన్ పరిధిలో 7175 కనెక్షన్‌లకు ఉపయోగం ఉంటుందన్నారు. తెనాలి ఈఈ చిరంజీవి మాట్లాడుతూ నూతనంగా నిర్మించిన సబ్‌స్టేషన్ వల్ల నందివెలుగు, ఎరుకలపూడి, చింతలపూడి, కంచర్లపాలెం, సోమసుందరపాలెం, అత్తోట, కొలకలూరు గ్రామాల్లో విద్యుత్ కొరత ఉండదన్నారు. 24 గంటలు విద్యుత్ సరఫరా ఉంటుందని, వినియోగదారులు సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించాలని కోరారు. గ్రామ సర్పంచి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో దేవీ భక్తబృందం సభ్యులు, పార్టీ నాయకులు ఎమ్మెల్యే శివకుమార్‌ను ఘనంగా సత్కరించారు. డీఈలు అశోక్ కుమార్, వెంకటేశ్వరరావు, రూరల్ ఏఈ వసంతరావు, ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, ఎంపీటీసీలు షేక్ షిలార్‌జానీ, తిన్నలూరి విజయలక్ష్మి, సొసైటీ చైర్మన్ తోటకూర వసంతరావు, గ్రామ ఉపసర్పంచి మంగా శివనాగేశ్వరరావు పాల్గొన్నారు.

విరమణలను విజయవంతం చేద్దాం

అధికారులతో దుర్గగుడి ఈఓ రామారావు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దీక్ష విరమణల సందర్భంగా ఇంద్రకీలాద్రికి విచ్చేసే భవానీలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని దుర్గగుడి ఈఓ కేఎస్ రామారావు, అధికారులను ఆదేశించారు. దుర్గగుడి ముఖ్య విభాగాల అధికారులతో ఈఓ రామారావు బుధవారం సమావేశమయ్యారు. మహా మండపం నాల్గో అంతస్తులోని ఈవో చాంబర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈవో మాట్లాడుతూ దీక్ష విరమణలకు రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భవానీలు తరలివచ్చే అవకాశం ఉందని, భవానీలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా వారికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. దసరా ఉత్సవాలను అన్ని శాఖల అధికారులు, ఆలయ అధికారులు సమన్వయంతో దిగ్విజయంగా పూర్తి చేశామో, దీక్ష విరమణలకు కూడా అదే ప్రణాళికలతో దిగ్విజయం చేయాలన్నారు. భక్తులకు కల్పించే సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వారికి అమ్మవారి దర్శనంలో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు శంకర శాండిల్య, యజ్ఞనారాయణ, ఏఈవోలు ఎన్. రమేష్‌బాబు, చంద్రశేఖర్, సుధారాణి, ఈఈ కోటేశ్వరరావు, లింగం రమాదేవి పాల్గొన్నారు.

'మల్లె మొగ్గల గొడుగు' పుస్తకావిష్కరణ


పుస్తకావిష్కరణ చేస్తున్న మాజీ మంత్రి డొక్కా, పెనుగొండ, మానస, వినయ్‌కుమార్ తదితరులు

పాత గుంటూరు: ప్రముఖ రచయిత ఎండ్లూరి సుధాకర్ రచించిన మల్లె మొగ్గల గొడుగు పుస్తకం మాదిగల జీవితానికి ప్రతిబింబమని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. బుధవారం బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, జాషువా, పూలే, పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కవి బి.విల్సన్ అధ్యక్షతన జరిగిన సభలో మల్లె మొగ్గల గొడుగు పుస్తకాన్ని అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ మాదిగల సంస్కృతి ఎంత గొప్పదో పుస్తకంలో వర్ణించారని తెలిపారు. కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత ఎండ్లూరి మానస మాట్లాడుతూ తమ తండ్రి ఎండ్లూరి సుధాకర్ భౌతికంగా దూరమైనా, ఆయన రచనలతో తెలుగు వారందరికీ గుర్తుండి పోయారని అన్నారు. కార్యక్రమంలో దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్ కుమార్, జయసుధ, కవి ఎస్ఎం సుభాని తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

- జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి
- ఫిరంగిపురంలో 'జగనన్నకు చెబుదాం'


జేసీ రాజకుమారికి అర్జీ అందజేస్తున్న ఎంపీపీ షేక్ షహేలా నర్గీస్

ఫిరంగిపురం: ప్రజాసమస్యల సత్వర పరిష్కారానికి జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి అన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలంటూ అర్జీలు అందజేశారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. తమ సమస్యలు పరిష్కరించాలంటూ పలుగ్రామాల నుంచి వచ్చిన ప్రజలు 86 అర్జీలు అందజేశారు. జేసీ రాజకుమారి మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వస్తున్న అర్జీలను జిల్లా, మండల స్థాయి అధికారులు స్పందించి సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రవీంద్రరావు, డ్వామా పీడీ వెంకటరామిరెడ్డి, ఆర్డీఓ శ్రీధర్, డిప్యూటీ కలెక్టర్ స్వాతి, జెడ్పీ సీఈఓ మోహన్‌రావు, పీడీ ఆర్డీ హరిహరనాథ్, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, జెడ్పీటీసీ సభ్యురాలు డి.కత్తిరేణమ్మ, ఎంపీపీ షేక్ షహేలా నర్గీస్, డీపీఓ శ్రీదేవి కుసుమ, జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎస్.వెంకటేశ్వర్లు, డీసీఓ వీరాచారి, పంచాయతీరాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య, తహసీల్దార్ పద్మనాభుడు, ఎంపీడీఓ విలియమ్స్, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ సత్యానంద్, ఇన్‌చార్జి ఈఓ కె.విష్ణువర్ధనరావు, వివిధశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

150 బస్తాల నల్లబెల్లం, 114 బస్తాల స్పటిక స్వాధీనం

దాచేపల్లి: గోడౌన్‌లో అక్రమంగా నిల్వ చేసిన నల్లబెల్లం, స్పటికను పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. గురజాల డీఎస్పీ పల్లంరాజు తెలిపిన వివరాలు.. నడికుడి మార్కెట్‌యార్డు సమీపంలోని ఓ గోడౌన్‌లో నల్లబెల్లం, స్పటిక నిల్వ చేసినట్లు జిల్లా ఎస్పీ కార్యాలయానికి సమాచారం అందింది. ఎస్పీ కార్యాలయం ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక సీఐ సురేంద్రబాబు, ఎస్ఐ సంధ్యారాణి గోడౌన్‌లో తనిఖీలు చేపట్టారు. 150 బస్తాల్లో నల్లబెల్లం, 114 బస్తాల్లో స్పటిక నిల్వ చేసినట్లుగా గుర్తించారు. నిల్వ చేసిన నల్లబెల్లం, స్పటిక స్వాధీనం చేసున్నామని, పెనుగొండ మలికార్జునరావు వీటిని నిల్వ చేసినట్లుగా గుర్తించామని, విలువ రూ.5 లక్షలు ఉంటుందని డీఎస్పీ చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, నిందితుడు పరారీలో ఉన్నట్లు వెల్లడించారు.